క్లుప్తంగా

ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన

దుగ్గిరాల: ఆహార పోషణ, బాలికల హక్కులపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి అన్నారు. సోమవారం దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యాన అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని బాలికల ఉన్నత పాఠశాలలో కిశోరబాలికలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వాణి మాట్లాడుతూ కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారంపై, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాల్సిన నియమాలు, ప్రతి బాలిక ఉన్నత విద్య అభ్యసించాలని పేర్కొన్నారు. స్పెషల్ గ్రేడ్ సూపర్‌వైజర్ ఎస్.భావాని మాట్లాడుతూ బాలికల హక్కులను వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్‌కు 1098, స్త్రీల వేధింపులు, అక్రమ రవాణా నిర్మూలన, కిశోర బాలికల హక్కులకు ఆటంకం కలిగిన సమయంలో 181కి కాల్ చేసి సమస్యని తెలియజేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఇంటి వెలుగు పాపాయి కంటికి వెలుగు బొప్పాయి, బాల్యవివాహాలను అరికడదాం బంగారు భవిత నిద్దాం, ఆడ పిల్ల ప్రగతికి జగతికి వెలుగు అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ షేక్ జబీన్, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయ డీఏ దేవేంద్రకు మూడు గోల్డ్‌మెడల్స్



ఫిరంగిపురం: ఏలూరులోని బిశ్వనాథ్ భాటియా స్విమింగ్ పూల్‌లో ఈనెల 12న రాష్ట్రస్థాయి 7వ పారాస్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. వీటిలో మండల కేంద్రంలోని సచివాలయం -2లో డీఏ (డిజిటల్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న దేవేంద్ర 50 మీటర్ల ఫ్రీస్టైల్, వందమీటర్ల ఫ్రీస్టైల్ ,50 మీటర్ల బ్రెస్ట్‌స్టోక్‌లో మూడు గోల్డ్‌మెడల్స్ సాధించారు. రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ బి.కోటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ సెక్రటరీ వి.రామస్వామి చేతులమీదుగా మెడల్స్‌ను అందుకున్నారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం దేవేంద్రను సర్పంచ్ మేడాబాబు, ఈవో ఏకేబాబులు శాలువాకప్పి సన్మానించారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు ఉంచడం సరికాదు

దుగ్గిరాల: రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు సత్వరమే ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, బకాయిలు ఉంచడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ విభాగం మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు సుమారు రూ.3 వేల కోట్ల బకాయిలను ఉండటంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారని, దీంతో ప్రజలకు ఉచిత వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా నెట్‌వర్క్ ఆసుపత్రుల ఎదుట ఆరోగ్యశ్రీపై వైద్యం చేయలేమని బోర్డులు ఏర్పాటు చేయడం శోచనీయమన్నారు. మైనార్టీ నేతలు పఠాన్ మస్తాన్ వలీ, జిలానీ పాల్గొన్నారు.

యాజమాన్యం కార్మికుల బకాయిలు చెల్లించాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్‌ఫ్యాక్టరీ కార్మికులకు యాజమాన్యం బకాయిలను చెల్లించాలని యూనియన్ నేత స్టీవెన్ డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలకు నాయకులు సుభాని, నాగేశ్వరరావుతో కలసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు 314 రోజులుగా దీక్షలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వంగానీ, యాజమాన్యంగానీ ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. కోర్టులు కార్మికులకు అనుకూలంగా తీర్పులు ఇచ్చినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గురవయ్య, అంకయ్య, సాంబశివరావు, కార్మికులు రమాదేవి, శారమ్మ, రిబ్కా, ఏడుకొండలు, అంకమ్మ, దుర్గా శాని, నాగమల్లీశ్వరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళగిరి పట్టణ పరిధిలోని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు సోమవారం ఆయన కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ నవంబర్ 3 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. నోటీసు అందజేసిన వారిలో సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గండికోట దుర్గారావు పాల్గొన్నారు.

తాళ్లాయపాలెంలో రోడ్డు ప్రమాదం

తాడికొండ: ఇసుక లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన ఘటన తాళ్లాయపాలెం టిడ్కో గృహాల వద్ద జరిగింది. వివరాల ప్రకారం సోమవారం రాత్రి తాళ్లాయపాలెం గ్రామానికి చెందిన పోలగంగు సాల్మన్(48) ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఇసుక లారీ ఢీకొట్టింది. అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి చేరాడు. అతన్ని ఆస్పతికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

నకిలీ మద్యం కుంభకోణంపై నిగ్గు తేల్చాలి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి సమన్వయకర్త డీవీఆర్



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త డీవీఆర్ తదితరులు

మంగళగిరి టౌన్: నకిలీ మద్యం కుంభకోణంపై నిగ్గు తేల్చాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని నవులూరులో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత ప్రభుత్వ పశువైద్యశాల నుంచి ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు భారీ ఎత్తున నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు, డీవీఆర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి నకిలీమద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి చిత్తూరు జిల్లా వరకు ఈ నకిలీ మద్యం తయారు చేసి, బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అమ్మకాలు జరుగుతున్నారని విమర్శించారు. ఈ కేసులో తెర వెనుక ఉన్న టీడీపీ నాయకులను బయటకు లాగాలన్నారు.

రూ.5 వేల కోట్ల కుంభకోణం

ఈ ఏడాదిలో సుమారు 5 వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, ఇది బయట పడకపోతే మిగిలిన కాలంలో ఎన్నివేల కోట్ల కుంభకోణం జరిగి ఉండేదోనని అన్నారు.

మంగళగిరిలో కోట్లు ఖర్చుపెట్టి కొందరు మద్యం షాపులు దక్కించుకుంటే వారి నుంచి టీడీపీ నాయకులు బలవంతంగా లాక్కున్న దాఖలాలు ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మంగళగిరి మండల అధ్యక్షులు ఎస్.వెంకట కృష్ణ, పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా నాగయ్య, దుగ్గిరాల జెడ్పీటీసీ అరుణ, దుగ్గిరాల మండల ఉపాధ్యక్షులు కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పచ్చల రత్నకుమారి, తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల ఎలీషా, రాష్ట్ర పంచాయితీ రాజ్ విభాగ సంయుక్త కార్యదర్శి ఈపూరి ఆదాం, మంగళగిరి దివ్యాంగ విభాగ అధ్యక్షులు వేమూరి వందనం, మంగళగిరి ఎస్సీ విభాగ అధ్యక్షులు కట్టిపోగు భూషణం, గుంటూరు చేనేత విభాగ అధ్యక్షులు పాల శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఎస్టీ విభాగ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు, జిల్లా దివ్యాంగ విభాగ అధ్యక్షులు బొక్క అగస్టీన్, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి మల్లవరపు సుధారాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, మంగళగిరినియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలు చిలుకూరి ఫిలోమిన, క్రిస్టియన్ మైనార్టీ విభాగ అధ్యక్షులు చిలుకా విక్టర్ ఇమ్మానియేల్, ఇంటలెక్చువల్ విభాగ అధ్యక్షులు జంగా నాగిరెడ్డి, గ్రీవెన్స్ విభాగ అధ్యక్షులు ఎర్రకోటి మల్లికార్జున రెడ్డి, ట్రేడ్ యూనియన్ విభాగ అధ్యక్షులు రత్నాకరం శ్రీనివాసరావు, యువజన విభాగం అధ్యక్షులు సయ్యద్ గౌస్ మొహిద్దీన్, మంగళగిరి పట్టణ యువజన విభాగ అధ్యక్షులు మాదాల గోపీకృష్ణ, మండల ఎస్సీ విభాగ అధ్యక్షులు శుభాకర్, రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి నూతక్కి జోష్, రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి షాలిని, మంగళగిరి నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు బి.రుక్మాంగరెడ్డి, నియోజకవర్గ మున్సిపల్ విభాగ అధ్యక్షులు సుబ్బారావు, బూత్ కమిటీ విభాగ అధ్యక్షులు దర్శి రమేష, బీసీ విభాగ అధ్యక్షులు తాడిబోయిన సుబ్బారావు, సోషల్ మీడియా అధ్యక్షులు భీమిరెడ్డి శరన్ కుమార్ రెడ్డి, ఎస్టీ విభాగ అధ్యక్షులు మేడా చైతన్య, లీగల్ సెల్ విభాగ అధ్యక్షులు కలకోటి సునీల్, పట్టణ మైనార్టీ విభాగ అధ్యక్షులు షేక్ మాలక్ బాబు, దుగ్గిరాల మండల మహిళా విభాగ అధ్యక్షులు సంసోనమ్మ, మంగళగిరి మండల ప్రధాన కార్యదర్శి చిన్నారి యాదవ్, మంగళగిరి మండల కార్యదర్శి మంద విజయ్‌బాబు, ఉపాధ్యక్షులు షేక్ గౌస్, తాడేపల్లి పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, ఉండవల్లి గ్రామ అధ్యక్షులు మున్నంగి శ్రీధర్ రెడ్డి, తాడేపల్లి మండల నాయకులు పిచ్చిరెడ్డి, అశోక్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి, దొడ్డ అనిత, ఇందిరాదేవి, నేతలు గంజి షణ్ముక్, తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



మంగళగిరి ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కుటీర పరిశ్రమలా నకిలీ మద్యం దందా

- కూటమి ప్రభుత్వంలో పేదల ప్రాణాలతో చెలగాటం
- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- తాడికొండలో నిరసన ప్రదర్శన అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత



నకిలీ మద్యంపై అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బాల వజ్రబాబు

తాడికొండ: ఏపీలో నకిలీ మద్యం దందా కుటీర పరిశ్రమలా తయారై పేదల ప్రాణాలతో చెలగాటమాడుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) అన్నారు. సోమవారం కల్తీ మద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు తాడికొండలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలి నుంచి బ్యానర్లు, ప్లకార్డులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు నేతలు, కార్యకర్తలు ర్యాలీగా వచ్చారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా కూటమి ప్రభుత్వ వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చెప్పిన వాగ్దానాలు, విధానాలకు వ్యతిరేకంగా పరిపాలన జరుగుతుందనేందుకు రాష్ట్రంలో ఏరులై పారుతూ నిర్వహిస్తున్న నకిలీ మద్యం దందానే నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వేలాది బెల్టు షాపులు వెలిశాయని, దీని వెనుక ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇన్‌చార్జులు పార్టీ నాయకుల పాత్ర ఉందన్నారు. కుటీర పరిశ్రమలా తయారు చేస్తున్న నకిలీ మద్యం బెల్టు షాపులకు సరఫరా అవుతుందని, దీంతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలను దోచుకోవడమే..

ప్రజల ప్రాణాల్ని త్రుణప్రాయంగా తొక్కేసి వారి మరణాలకు కారణమైన కూటమి ప్రభుత్వం ఆలోచనా విధానాలు కేవలం పేదల్ని దోచుకొని చిదిమేయడమే అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు 175 నియోజకవర్గాల్లో నిరసన కార్యక్రమం జరుగుతోందని నిష్పాక్షిక దర్యాప్తు చేపట్టి అవసరమైతే సీబీఐ దర్యాప్తు వేసి బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బెల్టు షాపులు, కల్తీ మద్యం దందాను నిలిపేసే చర్యలను ప్రభుత్వం తీసుకోపోతే తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మార్పుల శివరామిరెడ్డి, తాళ్ళూరు వంశీకృష్ణ, మైనేనా నాగ మల్లేశ్వరరావు, ఫిరంగిపురం జెడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, పలు రాష్ట్ర విభాగాల నాయకులు షేక్ మస్తాన్ వలి, బాకి వెంకటస్వామి, అరేపల్లి జోజి, మల్లంపాటి రాఘవరెడ్డి, నల్లిబోయిన శ్రీనివాసరావు, చుండు వెంకటరెడ్డి, దమ్మాటి మోహనరావు, షేక్ అజీస్, ఇనుకపల్లి రమేష్, మల్లంపాటి చందు, గుంటి రఘువరన్, బొంతా శ్రీకాంత్, షేక్ బాజీ, దొంతి రెడ్డి సీతారామిరెడ్డి, సాంబిరెడ్డి, నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, కొప్పుల శేషగిరిరావు, బెజ్జం రాంబాబు, తుమ్మూరు వరప్రసాదరెడ్డి, దానం వినోద్, కొయ్యగూర వినోద్, నాయుడు నాగేశ్వరరావు, జానీ బాషా, ఉడుముల పిచ్చిరెడ్డి, చేవూరి రామ్మోహనరెడ్డి, కొమ్మారెడ్డి ప్రవీణ్ రెడ్డి, యెంద్రెడ్డి హేమలతా రెడ్డి, మందాల శ్రీనివాసరెడ్డి, తుపాకుల కృష్ణ, షేక్ జుబేర్, షేక్ అబ్బాస్, పులి రమేష్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాల వజ్రబాబు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేస్తున్న వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

మంగళగిరి టౌన్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బాబూరావు మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తలకు వందల వేల ఎకరాలు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇస్తోందని, పేదలకు మాత్రం రెండు సెంట్ల స్థలం ఇవ్వడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నారా లోకేషన్ నెరవేర్చాలన్నారు. ఈనెల 17న దరఖాస్తులతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

17న తరలిరండి

తాడేపల్లి రూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 17న మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని సీపీఎం నేత వేముల దుర్గారావు పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నుకలపేటలో పేదల నుంచి అర్జీలను స్వీకరించారు. నాయకులు లక్ష్మి, మల్లీశ్వరి, రమణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

మంగళగిరి టౌన్: మంగళగిరికి చెందిన పరిణిక శతాక్షి, చేతస్ ఇద్దరు బాలలు రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గుంటూరు రోరల్ స్కేటింగ్ అసోసియేషన్ నిర్వహించిన 20వ గుంటూరు జిల్లా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2025లో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళగిరి మానస వికాస మండలి ఆధ్వర్యంలో సోమవారం బాలలకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానస వికాస మండలి అధ్యక్షులు రేఖ కృష్ణార్జునరావు మాట్లాడుతూ చిన్నారులను అభినందించారు. చిన్నారుల తల్లిదండ్రులు వెంకట సాంబశివరావు, శ్రావణి దంపతులను అభినందించి, చిన్నారులకు ప్రశంస జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ నరేష్‌బాబు, పెదకాకాని దేవదాయ శాఖ ట్రిబ్యునల్ సూపరింటెండెంట్ తలగాని జ్యోతి, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న మానస వికాస మండలి సభ్యులు

లాంలో టీడీపీ నేత ఆక్రమణలపై ఫిర్యాదు

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో టీడీపీ నేత షేక్ మహబూబ్ సుభానీ ఆక్రమణలపై గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 199/ఎ సర్వే నంబర్‌లో మహబూబ్ సుభానీ రూ.20 కోట్ల విలువ చేసే స్థలాన్ని ఆక్రమంచి తప్పుడు పత్రాలతో బ్రిక్స్ ఇండస్ట్రీ నిర్మిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే సర్వే నంబర్‌లో అక్రమ కట్టడాలు ఉన్నాయంటూ డబ్ల్యూ పి నంబర్ 32469/2023లో కోర్టుకు వెళ్ళి పేదలు కట్టుకున్న 40 ఇళ్లను అధికారులను అడ్డుపెట్టుకొని నిర్దాక్షణ్యంగా కూల్చివేశారన్నారు. ఇప్పుడు అదే పోరంబోకు స్థలంలో అతనే అక్రమంగా నిర్మాణం చేస్తున్నాడని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్‌వోసీ జారీ చేయగా విద్యుత్ డిపార్ట్‌మెంట్ కూడా 3 ఫేస్ కరెంట్ మీటరు మంజూరు చేశారని, అధికారుల అండదండలతో చెలరేగుతున్న ఇతని ఆక్రమణలను నిలిపివేయాలని కోరారు. పేదలు రేకుల ఇళ్ళు నిర్మించుకొని కరెంటు కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకుంటే కొండ పోరంబోకు అని విద్యుత్ కనెక్షన్ ఇవ్వని అధికారులు సుభానీకి ఎలా ఇస్తారన్నారు. కోర్టు ఉత్తర్వులను పెడచెవిన పెట్టి కొండను బ్లాస్టింగ్ చేస్తూ రాళ్ళు తొలగిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇతనిపై చర్యలు తీసుకొని అక్రమ కనెక్షన్‌లు, ఎన్‌వోసీలు జారీ చేసిన అధికారులు ఆ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు.



లాంలో బ్రిక్స్ యూనిట్ స్థాపనకు ఆక్రమించిన కొండ పోరంబోకు స్థలం

తెనాలి రోడ్డు విస్తరణ నోటిఫికేషన్ రద్దుకు ర్యాలీ

మంగళగిరి టౌన్: తెనాలి రోడ్డు విస్తరణ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ తెనాలి రోడ్డు చేనేత వ్యాపార పరిరక్షణ, విస్తరణ బాధితుల సంఘం కన్వీనర్ జొన్నాదుల గురుమోహనరావు కోరారు. మంగళగిరి పట్టణ పరిధిలో తెనాలి రోడ్డులోని కొత్తరామాలయం వద్ద నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకు వ్యాపారులు, ధార్మిక సంఘాలు, కార్మికులు, నివాసితులతో కలసి సోమవారం ప్రజార్యాలీ నిర్వహించారు. అనంతరం కమిషనర్ అలీమ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడూ 2025 ఆగస్టు 28వ తేదీన వెలువడిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా తెనాలి రోడ్డును 60 అడుగులకు విస్తరించే ప్రతిపాదన ప్రజాభిప్రాయాన్ని పూర్తిగా విస్మరించి తీసుకున్న నిర్ణయమన్నారు. జూలైలో జరిగిన సమావేశంలో తెనాలి రోడ్డు నిర్వాసితులు, ధార్మిక సంఘాలు, చేనేత వ్యాపారులు తెనాలి రోడ్డు విస్తరణకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని తెలియజేశారని, అనంతరం పలుమార్లు వినతిపత్రాలు కూడా సమర్పించినా గెజిట్ విడుదలచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

జీఎస్టీ 2.0పై అవగాహన

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో జీఎస్టీ 2.0 ఫ్యూచర్ ఎకానమీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, గిగ్ వర్క్స్ అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె. శకుంతల, సెక్రటరీ దివ్య కుమారి, ఎంపీడీవో సుగుణమ్మ పాల్గొన్నారు.

కె.రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలో కె.రిడ్జ్ విద్యార్థులు జాతీయ చాంపియన్ షిప్‌నకు ఏరో స్కేట్‌బాల్ అంతర్ జిల్లా ఎంపికల్లో పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ జి.బర్నబాస్ సోమవారం తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఏరోస్కేట్‌బాల్ అండర్ 14 గ్రూప్‌లో కె.కార్తికేయ, ఎం. మన్సూర్ పాషా, షేక్ ఇమ్రాన్, పి. కార్తికేయ, మోక్షరామ్ చరణ్, ఎ.గోపి హర్ష, లాస్యంజలి, జి. మధుశ్రీ చందు, ఎస్. మోక్షిత్, ఎ. చైతన్యరామ్, ఎస్. ప్రభురామ్, కె. సాయి సంప్రీత్ ప్రథమ బహుమతిని కైవం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య అభినందించారని పేర్కొన్నారు. కోచ్‌లు ఫిరోజ్‌ఖాన్, ఖాజాబీలను ప్రశంసించారు.

‘బిల్డ్‌థాన్’లో రావెల జెడ్పీ పాఠశాల ఎంపిక

తాడికొండ: వికసిత్ భారత్ బిల్డ్‌థాన్-2025 మెగా స్కూల్ ఇన్నోవేషన్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు తమ పాఠశాలకు అవకాశం లభించడం హర్షణీయమని రావెల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జె.అంజలీదేవి అన్నారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొన్ని పాఠశాలలను ఎంపిక చేయగా రాష్ట్రం నుంచి మొత్తం 3 స్కూళ్లు ఎంపికయ్యాయి, అందులో రావెల జిల్లా పరిషత్ పాఠశాలకు స్థానం లభించిందని ఆమె తెలిపారు. సోమవారం పీఎం శ్రీలో తమ విద్యార్థులు పాల్గొనగా కార్యక్రమంలో భాగంగా వీరికి ఆత్మ నిర్భర్ భారత్, స్వదేశీ, వోకల్ ఫర్ లోకల్, సమృద్ధ్ భారత్ అనే 4 థీమ్స్ ఇచ్చారన్నారు. వీటిని పరిశీలించి అటల్ ల్యాబ్‌లో ఈ నెల 31వ తేదీలోగా పొందుపరుస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో యునిసెఫ్ కన్సల్టెంట్ టి. సుధాకర్, రాష్ట్ర కార్యాలయం డీఎస్‌వో గేసుల్ మీరా, ఈఆర్‌డీసీ టెక్నికల్ టీమ్, అటల్ ఇన్‌ఛార్జి ఈ లావణ్య సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కౌలురైతు చట్టాలను అమల్లోకి తేవాలి

దుగ్గిరాల: అన్నదాత సుఖీభవ పథకం రూ.20వేలు కౌలు రైతులకు కూడా చెల్లించాలని, నూతన కౌలు చట్టాలను వెంటనే తీసుకురావాలని జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం దుగ్గిరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా ముసాయిదా చట్టాన్ని అసెంబ్లీలో పెట్టి ఇంత వరకు ఆమోదించలేదన్నారు. భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ పంట రుణాలు, పెట్టుబడి సాయం, పంట నష్ట పరిహారం, ఈ క్రాప్, పంటల బీమా, పంట అమ్ముకోవడం లాంటి అన్ని సౌకర్యాలు పొందేటట్లు నూతన చట్టం తేవాలని అన్నదాత సుఖీభవ వాస్తవంగా పంటలు పండించే రైతులకు, కౌలు రైతులకు ఇవ్వాలన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు పంట రుణాలు ఆర్.బి.ఐ గైడ్‌లైన్స్ ప్రకారం రెండు లక్షల వరకు హామీ లేని పంట రుణాలు ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఐ.సునీత కి వినతి పత్రం అందించారు. ఇస్మాయేలు ఖాన్, వీరయ్య, బుజ్జి, రాంబాబు, సుబ్బారావు, జగన్మోహన్‌రావు, ఆరిఫ్ పాల్గొన్నారు.

కౌలుదారు గుర్తింపుకార్డుల కోసం వినతి

ఫిరంగిపురం: కౌలుదారు గుర్తింపు కార్డులను ఇవ్వాలని కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జె.ప్రసాదరావుకు సోమవారం కౌలుదారు గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులందరికీ వర్తింపజేయాలని చెప్పారు. ఎన్నికల ప్రణాళికలో కూటమి నాయకులు కౌలుదారు కార్డులు ఇస్తామని చెప్పి 16 నెలలు గడిచినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో కౌలురైతులు వేసిన పైరులకు ఈ-క్రాప్ చేయకపోవడంలో యూరియాను కూడా అధికధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆయన వెంట మండల రైతుసంఘం నాయకుడు మార్పుల వెంకటరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, కె.వెంకటేశ్వర్లు ఉన్నారు.



తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతుల సంఘం నేతలు

మంగళగిరి టౌన్: కౌలు రైతులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీ కౌలు సంఘం, ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం మంగళగిరి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి రూరల్ అధ్యక్షులు జి. అజయ్‌కుమార్, నాయకులు మేరి, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు భాస్కరరెడ్డి, సిఐటియు మంగళగిరి మండల కార్యదర్శి ఉద్దంటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందించాలని రైతు సంఘం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు అన్నారు. సోమవారం తాడికొండలోని బస్టాండ్ వద్ద ఈ మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ నిర్మలా కుమారికి వినతి పత్రం అందించారు. రైతు సంఘం మండల నాయకులు బాణావత్ భద్రయ్య, నీలయ్య, జోషి, అమరేశ్వరరావు పాల్గొన్నారు.

ఆటో ప్రయాణికులను కాపాడిన ద్విచక్ర వాహనచోదకులు

దుగ్గిరాల: చింతలపూడి సమీపంలో కాలువలోకి వెళుతున్న ఆటోని చాకచక్యంగా ఆపి ప్రయాణికుల ప్రాణాలను ద్విచక్ర వాహనచోదకులు చిలువూరి సురేష్, ఇందుపల్లి రాజారాం కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెనాలి వైపు వెళ్తున్న ఆటోలో ఇద్దరు ప్రయాణికులు, డ్రైవరు ఉన్నారు. నిద్రమత్తులో ఉన్న డ్రైవర్ అదుపుచేయలేకపోవడంతో ఆటో కాలువలోకి జారుతోంది. ఆ స మయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న సురేష్, రాజారాం గమనించి ఆటో ఇనుప రాడ్‌ని పట్టుకుని ఆపారు. తర్వాత స్థానికుల సాయంతో ఆటోలో నుంచి ప్రయాణికులను బయటకు తీశారు. డ్రైవర్ చేతికి గాయం కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు ప్రయాణికులను వేరే వాహనంలో ఇంటికి పంపారు.

‘ఓటు చోరీ అంశంలో దొరికిన బీజేపీ’

తాడికొండ: ఓటు చోరీ అంశంలో పట్టపగలే దొరికిన దొంగ బీజేపీ అని గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ అన్నారు. రాజధాని తుళ్ళూరు మండలంలోని రాయపూడి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అడుసుమల్లి శ్రీనివాస్‌తో కలసి సంతకాల సేకరణ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్‌తో కలిసి దేశవ్యాప్తంగా బీజేపీ ఎలా ఓట్ల చోరీకి పాల్పడిందో రాహుల్ గాంధీ పుణ్యమా అని ప్రతి వ్యక్తికి అర్థమైందన్నారు. ఈ చోరీ వ్యవహారంలో రాష్ట్రంలో ఉన్న ప్రధాన పార్టీలన్నీ అప్రమత్తమయ్యాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాల మంచ్, రాష్ట్ర అధ్యక్షులు బొర్రా రవిచంద్ర, వెలగలేటి కోటేసు తదితరులు పాల్గొన్నారు.

బీ ఫారం పట్టాలు రెగ్యులరైజ్ చేయండి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: ఉండవల్లి పరిధిలో గతంలో ఇచ్చిన బీ ఫారం పట్టాలను ప్రభుత్వం రెగ్యులైజ్ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉండవల్లిలోని అమరారెడ్డినగర్‌లో 1988లో అప్పటి ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకున్నవారికి బీ ఫారం పట్టాలను ఇచ్చారని, వాటిని ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయించి రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నేతలు ఈమని రామారావు, ఉండవల్లి పార్థసారథి, గాంధీ, తుమ్మపూడి శివయ్య తదితరులు పాల్గొన్నారు.